# 5. కథకోసం

ఇంటిదగ్గర్నుంచి తిరిగి మెడ్రాసు చేరబొయ్యేముందు అతని మాట జ్ఞాపకం వచ్చింది. గత ఎనిమిది నెల్ల నుంచీ- అంటే నేను పత్రిక నడపటం మొదలు పెట్టినప్పటినుంచీ- అతన్ని చూడాలనీ, అతనితో మాట్లాడాలనీ, రెండు మూడు రోజులు అతనితో కులాసాగా గడపాలనీ, చాలా కుతూహల పడుతూండేవాణ్ణి- విశేషించి గత రెండుమూడు నెల్లలోనూ కథ పంపమని ప్రాధేయపడుతూ అతనికి రాసిన ఐదారు ఉత్తరాలకూ జవాబైనా లేదు. పాపం- అతని ఆరోగ్యం ఏమన్నా చెడిందేమో? అతని కథల కోసమే తాము పత్రికను కొంటూన్నట్టు రాసిన యాభైమంది పై సంఖ్య పాఠకులందరూ నాకు జ్ఞాపకమొచ్చారు. పత్రిక వెలువడటం మొదలయ్యాక నాకు ఎదురైన ప్రతి స్నేహితుడూ, ప్రతి పరిచయ వ్యక్తీ- అతని కథను గూర్చి కనీసం రెండుమూడు నిమిషాలన్నా పొగడకుండా వదలక పోవటాన్ని నేనింకా మరిచిపోలేదు. అతని కథను చదవకుండానే చాలాసార్లు అచ్చుకు ఇచ్చాను. నా దృష్టిలో అంత గౌరవస్థానాన్ని సంపాయించుకు కూర్చొని, నా పత్రికకు చేదోడు వాదోడుగా వున్న వ్యక్తిని ఒకసారి కలుసుకోవాలని ఎందుకుండదు? ఇంకెప్పుడోనని వాయిదా వేసుకుంటే లాభంలేదు. దార్లోనే కనక తప్పకుండా దిగి అత న్నొకసారి కలుసుకోవాలనే నిశ్చయించుకున్నా-

వెతుక్కుంటూ అతని ఇల్లు చేరేప్పటికి మధ్యాహ్నం మూడుగంటలు దాటుతోంది. పెద్దమేడ చూడగానే అతని ఐశ్వర్యం కొంతభాగం గ్రాహ్యమైంది. ఒక యువకుడు- స్ఫురద్రూపి, అందగాడు- విలువైన బట్టలు వేసుకొని సిగరెట్టు కాల్చుకుంటూ వరండాలోని సోఫాలో కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు.

"శ్రీహరిరావుగారు ఉన్నారాండి?" అన్నాను, అతన్ని ఉద్దేశించి.

"మీరెవరు?" అన్నాడు నా ప్రశ్నను తప్పించి.

"నేను... పత్రికా సంపాదకుణ్ణి-"

"ఓ... మీరా!... రండి... నేనే శ్రీహరిరావును-" అని ఎంతో గౌరవంతో ఆహ్వానించాడు.

చేతిసంచీ లోపలపెట్టి, మంచినీరు తాగి- అతనితో పాటే సోఫాలో కూలబడి - లోకాభిరామాయణం మొదలు పెట్టాను. అతనితో మాట్లాడుతూంటే ఎండలో తిరుగుతూ శ్రమపడ్డ విషయమూ, ప్రయాణపు బడలికా కూడా మరిచిపొయ్యాను. బైట సూర్యుడు నిరాటంకంగా, నిర్దయగా ప్రసరింపజేసే ఆ వేడిలోని ఏ భాగమూ - ఆ మేడలోకి వచ్చేందుకు వీల్లేదు. ఆ విలువైన కుర్చీలూ, సోఫాలూ, పంకాలూ, విద్యుద్దీపాలూ చూస్తే నాక్కూడా అలాటివి వుంటే ఎంత బాగుండునో అనిపించింది.

"మీరీమధ్య కథలేమీ పంపటం లేదు-" అన్నాను.

"ఏం రాయమంటారు?" అన్నాడు నవ్వుతూ.

"మీరు ఏదిరాసినా గొప్పగానే వుంటుంది. పాఠకులు మీ కథలకోసం ఎదురు చూస్తుంటారు. మీ కథలు పత్రికలో రాకపోతే వాళ్ళు నిరుత్సాహపడుతూ రాసిన ఉత్తరాలు చాలా ఉన్నయ్-" నా మాటలకు అతని ముఖంలో నేను ఎదురుచూస్తూన్న వికాసం కన్పించకపోవటం నాకు కొత్తగానే తోచింది.

నిట్టూర్చి నవ్వి, "ఏదిపడితే అదల్లా రాయనా?" అన్నాడు.

"అంటే... ఆదర్శమైన, నిర్మలమైన ప్రేమను గూర్చిన మంచి ప్రబోధకరమైన కథలు రాస్తే-?" అన్నాను. నాకు తెలిసిన మామూలు పదాలతో కార్యక్రమం సూచిస్తూ.

మళ్ళీ నాకు అర్థంకాని అగాధంతో నవ్వాడు.

"మీకింకా అర్థమవలేదు లెండి- తరువాత చెప్తాను- అటువెళ్దాం-" ఇద్దరమూ లేచి బయలుదేరాం. ఈ ఐశ్వర్య పండితునితో పాటు రోడ్డుమీద నడుస్తూంటే- అతని భాగ్యంలో ఏదో కనపడని భాగం నాకు అతుక్కున్నట్టుగా గర్వం కలిగింది.

నాలుగు సందులు దాటాక, నడుస్తూన్న వాడల్లా ఠక్కున ఆగి అటు చూడసాగాడు. నేను కూడా ఏమిటా అని వెంటనే ఆ దిక్కే చూశాను. ఆ పూరిపాక ముందు ఒక యువతి నిలబడి వుంది. నేనటు చూసేప్పటికే ఆమె తలతో సౌజ్ఞను పూర్తిచేసింది. అతను ఒక్క క్షణమాగి కదిలాడు. ఆమెను చూస్తూ ఏ ఒక్కరికీ హక్కులేని రోడ్డుమీద మరికొంత సేపు నిలబడాలనిపించింది. కాని అతని చూపు వారిద్దరి మధ్యా నాకు అర్థమవని ఏదో పరిచయాన్ని చాటటంవల్ల, అతను నన్ను గూర్చి ఏమనుకుంటాడోనని, మహా బుద్ధిమంతుడిలాగు అతనితోపాటే నడవసాగాను.

మొత్తానికి ఇతడు రసికుడే ననిపించింది. ఇంట్లో ఆడవాళ్ళున్న ఛాయలేమీ కానరావు. అందమైన యువతులతో హాయిగా జీవితాన్ని గడపటానికి అలవాటు పడ్డాడేమో? అతన్ని అడిగి తెలుసుకునేందుకు దమ్ములు లేవు. ఊహించేందుకు అసలే వీలుపడదు. ఏతావాతా ఈ సంస్కారం ప్రసాదించిన ఏమీ ఎరుగనితనాన్ని చచ్చినట్టు నటించాను.

* * *

చీకటిపడగానే వంటవాడిచేతి భోజనాన్ని తిని- పోర్టికోలో కుర్చీల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నాం. ఉండి ఉండి అతను చేతిగడియారాన్ని చూసి, "ఎడిటర్‌గారూ! మీకివ్వాళా ఒక తమాషా చూపిస్తాను-" అన్నాడు.

"ఏమిటీ?" అన్నాను.

"ఏమిటో ఇప్పుడు చెప్పేది కాదు- కాస్త శ్రమకు ఓరుస్తే కొత్త విషయం చూడొచ్చు-"

"ఓఁ దానికేం!" అన్నా- అదెల్లాంటి 'శ్రమ' కింద మారుతుందో నని దిగులుగానే వుంది.

"ఐతే నాతో రండి-" అని ఒక గదిలోకి తీసుకువెళ్ళి తలుపుదగ్గరగా కుర్చీలాగి, "ఈ తలుపు దగ్గర కూర్చొని అవతలిగదిలో జరిగే తమాషా చూడండి. జాగర్త నవ్వేరు! అవతలి గదిలో శబ్దం వినిపించగానే లైటు తీసేసి- ఈ కంత ద్వారా చుక్కానీ చూడండి-" అన్నాడు.

నేను తల తిప్పాను. అతను వెళ్ళిపొయ్యాడు. 'ఏమౌతుందో?' ననే ఆతృత అధికమైంది. అవబోయ్యేదాన్ని కాస్త అటూ ఇటూగా నన్నా ఊహించగలుగుతే ఇంత ఇబ్బంది ఉండేదికాదు. క్షణాల్ని లెక్కిస్తూ కుర్చీలో కూలబడ్డాను. యిరవై నిమిషాలు గడిచివుంటై. అవతలి గదిలో శబ్దమైంది. వెంటనే లైటు తీసేసి అతను చెప్పిన ప్రకారమే నా స్థలంలోజేరి చూడసాగాను.

అవతలి గదిలో లైటు వేయబడ్డది. అతనూ, అతని వెనుక ఒక యువతీ ప్రవేశించారు. ఆడది కన్పించేప్పటికి- నా నిద్రమత్తూ, ప్రయాణపు బడలికా యెగిరిపోయినై. ఇంకా ఆతృతతో చూడసాగాను.

ఆమె ఇందాక పూరిపాక ముందు నిలబడివున్న యువతే! యిందాక చూసే అవకాశం లేకపోయింది. ఇప్పుడు ఎంతసేపు ఆమె అవతల నిలబడి ఉంటుందో- అన్ని క్షణాలూ వృథాచేసుకోకపోయినా ఫర్వాలేదు- అతని కథల్లో వచ్చే అందమైన పిల్లల్ని ఇదివరకే ఊహించుకున్నాను. కాని ఈమెను చూశాక ఆ ఊహా సుందరుల స్థానాన్ని వెంటనే ఈమె ఆక్రమించుకుంది. ఆమె దుస్తుల్ని పట్టిచూస్తే- సామాన్య

కుటుంబానికి చెందింది లాగుంది. కాని అందానికి గుడ్డలూ నగలూ మాత్రమే ప్రత్యేకస్థానాన్ని ఇవ్వగలవనే మాట ఈమె విషయంలో అబద్ధమైంది.

ఇక జరుగబొయ్యేదంతా నా మనస్సులో - క్షణంలో సినిమా బొమ్మల్లాగు తిరిగిపోయింది. అతను ఆ రాత్రల్లా ఆమెతో గడుపుతాడు. ఆమెను తాకటమే గొప్ప అదృష్టంగా భావించిన నేను... ఇది చూస్తూ బిక్కుబిక్కుమంటూ ఇక్కడ కూర్చొని భరించాలి కాబోలు! అసలు నేను ఈర్ష్యపడటంలో కూడా కొత్తరకం ఆనందం తనకు కలుగుతుందనే అతను ఈ ఎత్తు ఎత్తాడేమో? భగవంతుడు నాకు తగిన శక్తిని యిచ్చి ఉంటే అతన్ని మెడపట్టుకుని బైటికి గెంటి ఆ స్థానంలో నేను జేరనూ- పరిచయమైన కొన్ని గంటల్లోనే తన వ్యక్తిగత జీవితంలో ఈ రసమయ ఘట్టాల్ని నాకు చూపటంలో అర్థమేమిటో?"

ఆమెకొక కుర్చీ చూపాడు. ఆమె కూర్చున్నాక- అతను ఫాన్‌చేసి మరో కుర్చీని ఆమె దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

నేను ఆతృతతో గట్టిగా ఊపిరి పీలుస్తున్నాను. గుండె లెక్క పెట్టలేనంత వడిగా కొట్టుకుంటోంది- నా కళ్ళముందు, నాకేదో అన్యాయంచేసి అతను స్వర్గసౌఖ్యాన్ని అనుభవించబోతున్నాడు కాబోలు! ఇంత మంచిపిల్లను సంపాయించటం ఎంత అదృష్టం!

పంకా గాలికి ఆమె ముంగురులు ఫాలభాగంమీద చక్కని నాట్యాన్ని చేస్తున్నయ్. ఎంత నాజూకు! చెయ్యెత్తినప్పుడు ఆ గాజుల గలగల కొత్తరకం సంగీతాన్ని విన్పిస్తోంది. ఆ నున్నని చెక్కిళ్ళమీదపడే ఎలక్ట్రిక్ లైటు కాంతికికూడా మీటర్‌తో కొలవలేని కొత్త విలువవుంది. సిగ్గుపడుతూన్నట్టుగా కన్పించే ఆమె స్త్రీత్వాన్ని భాషలో చెప్పడం ఎలా?.... డబ్బులేనిది కాబోలు! సిల్కుచీరెలూ బంగారు ఆభరణాలూ ఇవ్వలేని ఆ అందమే యీ ఊహకు కారణం. బోగంది కాదు కదా?... ఎంత తీసుకుంటుందో? నిజంగా వేశ్యే అయితే- సంఘంలో వేశ్యల ఆవశ్యకత అర్థమైంది. ఎలాగైనా వీలుచేసుకుని రెండు మూడు రోజులుండైనా ఆమెతో ఆనందించి...

అతను మెల్లిగా దగ్గాడు. ఆమె తలెత్తి అతనివైపొకసారి చూసి, మళ్ళీ తలవాల్చి బొటనవేలుతో ఆ మెత్తని తివాసీ మీద ఏ భాషో రాస్తోంది.

"కల్యాణీ" అన్నాడు అతను. ఆమె తలెత్తింది.

"నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?"

ఆమె కళ్ళెగరేసి తలవూపింది. అతను కాస్త ఆగి, "ఇదివరకు నేను నీ చుట్టూ తిరుగుతే ఒక్కమాటైనా మాట్లాడేదానివి కాదుకదా! అప్పుడు ప్రేమలేదూ?" అన్నాడు.

"అబ్బ!... ఉన్నది... ఎవరైనా చూస్తే ఏమన్నా అనుకుంటారని-" అని మిగతాది అర్థం చేసుకోమన్నట్టు ఆగింది.

ఈ సంభాషణ నాకేమీ రుచించటంలేదు. శృంగార కావ్యాల్లో చదివిన పద్యాలు జ్ఞాపక మొస్తున్నయ్ అలాగే యీ దృశ్యకావ్యంకూడా నడుస్తే ఎంత బాగుండును... కాని, ఏమిటీ చొప్పదంటు ప్రశ్నలువేసి కాలాన్ని వృథా చెయ్యటం?

"అది కాదు... పోనీ నన్ను ప్రేమిస్తున్నావ్‌కదా- పెళ్ళి చేసుకోకూడదూ?" అన్నాడు అతను.

"మిమ్మల్నా? మీకు భార్య వుందిగా!"

"ఉంటేనేం- నువ్వూ ఉందువుకాని."

"ఒద్దు-"

"నీకు ఇష్టంలేదా?"

"ఉహుఁ" అని తల అడ్డంగా తిప్పింది.

"మరి నీ ప్రేమ ఏమైంది?"

"ప్రేమా?" అని యీ ముందరి కాళ్ళకుపడ్డ బంధాలకు ఆమె ఇబ్బందిగా కుర్చీలో కదిలి, "అబ్బ!... ఉండండి- నిజంగా?" అంది చివరిమాట మీద నొక్కుతూ.

అతను విరగబడి నవ్వటం కూడా ఆమెకు బాధను కలిగించినట్టు తోస్తోంది. ఆ బాధే మరొక క్షణంలో కోపంగా మారి, ముఖాన్ని ముడిపించి, మూతిని అతిముద్దుగా ముడిపించింది. ఈ మూర్తి ఇంకో కొత్తసుందరిని ప్రదర్శిస్తూన్నట్లనిపించింది.

"పోనీ ఇప్పుడెవరన్నా చూస్తే ప్రమాదంకదూ?" అన్నాడు అతను మామూలు ధోరణిలో.

"ఊఁ" అంది- ఎంత ప్రసన్నత!

"మరి పెళ్ళిచేసుకుంటే ప్రమాదముండదుగా?"

"ఇప్పుడెవరు చూస్తారేం?" అంది మళ్ళీ ప్రశ్న తప్పించి.

అతను చిరునవ్వు నవ్వి, "చూస్తేనే... కీడెంచి మేలెంచటం మంచిది... ఒకవేళ ఎవరన్నా పసికడితే- రేపు నీకు పెళ్ళవ్వటం కష్టం కదూ?" అన్నాడు.

"పోనీండి- తరువాత చూసుకోవచ్చు."

'ఏమిటా యీ పాడు ప్రశ్నలనిపిస్తోంది. ఆమె గోలలన్నీ ఇతనికెందుకూ? ఆమెను ఎవరైనా చూస్తే వచ్చే ప్రమాదం ఆమెకుకాని ఇతనికెందుకూ? ఐనా ఆమె వాటన్నిటికీ సిద్ధమై వస్తే ఇలా బెదరకొట్టటం దేనికి? అందాల రాణిని ఎదురుగా కూర్చోపెట్టుకుని కాలం విలువకట్టటమే తెలియకపోతే- నేనైతేనా?-'

"పోనీలే- ఇదివరకు నువ్వెవర్నన్నా ప్రేమించావా?"

ఏమిటీ అనవసరపు ప్రశ్న- ఒకవేళ ప్రేమిస్తే మాత్రం ఇతనికి చెప్పాలని వుందా?

"పోనిద్దురూ–"

"ఊరికనే అడుగుతున్నా– నిజం చెప్పు."

ఆమె అతని ముఖంలోకి పిచ్చివాణ్ని చూసే చూపుచూసి మౌనంగా ఊరుకుంది.

"చెప్పవూ?" అన్నాడు, బతిమాలుతూన్నట్టు.

'లేదు' అన్నట్టు తల తిప్పింది.

"లేదూ?... అదుగో– అబద్ధమాడుతున్నావ్– నేను చెప్పనా?... నువ్వు మీ స్కూల్లో చదివే మనోహరాన్ని ప్రేమించటం లేదూ?"

ఆమె కొద్ది ఆశ్చర్యంతో అతన్ని చూసి, సిగ్గుగా తలవంచింది.

"ఏం చెప్పు" అన్నాడు.

"పోనీండి–" అని తప్పించుకునేందుకు చూసింది.

"కాదు– నువ్వు నిజంగా అతన్ని ప్రేమించావ్ కదూ?"

కాస్త అనుమానంతో ఔనన్నట్టు తల తిప్పింది.

"మరి అతనితో ఒక్క రాత్రన్నా గడిపావా?"

ఆమె మాట్లాడలేదు. ఆమె ముఖంలో ఒక విధమైన ఓర్వలేనితనం తన ఛాయల్ని పరుచుకుంటోంది.

"నేను ఊరికనే అడుగుతున్నాను."

'లేదు' అన్నట్టు తల తిప్పింది, వదిలించుకునేందుకు ప్రయత్నిస్తూన్నట్టు.

"మరి ప్రేమను అతనిమీద వుంచి, నా దగ్గరికి వచ్చేందుకు మనసెట్లా ఒప్పింది చెప్పు–" అన్నాడు. కోర్టులో తన వాదం బలపడుతూండగా లాయర్‌గారు ఉపయోగించే కంఠధ్వనితో.

'ఆఁ' అని కాస్త తెప్పరిల్లి, "మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తున్నా–"

"ఇంకా ఎంతమందిని ప్రేమిస్తున్నావ్?"

"ఇంకెవ్వరూ లేరు–"

"పోనీ– ఆ మనోహరంతో ఒక్క రాత్రన్నా గడపలేక పొయ్యావూ?"

"వీలుపడదు–"

అతను కాస్త ఆలోచించి ప్రసంగాన్ని మారుస్తున్నట్టుగా గొంతు మార్చి అన్నాడు:

"ఈ రాత్రి– గడిచాక, ఒకవేళ నువ్వు గర్భందాల్చుతే ఏమౌతుంది?"

ఆమె అదిరిపడ్డది. సిగ్గుపడ్డది. ఏదో ఇష్టంలేని ప్రశ్న పడుతున్నప్పుడు ముఖంలో కన్పించే బాధకు గురైంది. ఆ ముద్దుముఖంలో, అమాయకపు తెరమీద ఆ భావాలన్నీ ముద్రితమౌతూనే ఉన్నాయ్-

ఇంతవరకూ ఆమెను తాకకుండా నిగ్రహంతో, ఓర్పుతో అతను ఇన్ని ప్రశ్నల్ని ఎలా వేయగలుగుతున్నాడో నాకు ఆశ్చర్యమే అయింది. ఆమె చూడబోతే జాణగా లేదు. అమాయకురాలిగా, దాదాపు ప్రథమ అనుభవంకోసం వచ్చినట్టుగా తోస్తోంది... ఆమెను అన్నీ తెలిసిన తను, ఇలాటి ప్రశ్నలు వేసి భయపెడితే ఏం లాభం? ఒకవేళ ఆమె గర్భవతయితే ఇతనికేం- ఇంకేమైతే ఇతనికేం? ఆమె చావు ఆమె ఛస్తుంది! నామాత్రం తెలివితేటలు కాస్తన్నా అతని బుర్రలో ఉంటేనా- మరి మంచి కథలెల్లా రాస్తున్నాడో?

ఆమె మళ్ళీ మామూలు స్థితికి వొచ్చేప్పటికి రెండు నిమిషాలు పట్టింది.

"చూడు కళ్యాణీ! రేపు నువ్వు గర్భవతివైతే- నిన్ను పెళ్ళెవరు చేసుకుంటారు-?"

ఇలా ప్రశ్నలు వేసి చంపటం ఏమిటో నాకు అర్థమవటం లేదు. విశేషించి వాటి అర్థం ఆమెకూ నాకూ కూడా ఒకే మాదిరిగా తోస్తోందేమో?

ఆమె జవాబు చెప్పలేకపోతోంది.

"పోనీ- గర్భస్రావం చేసుకుంటావా?- అది పట్టుబడితే నీకు జైలు తప్పదు- తెలుసా?" చట్టాల్ని కూడా ఇరికించి ఆమెను భయపెడతాడేం?

ఆమె ఉక్కిరి బిక్కిరవుతోంది.

"ఎందుకూ నీకీప్రేమా గీమాను? రేపు శిశువును కన్నాక- ఎవరి బిడ్డంటే ఏం చెప్తావ్?- నా బిడ్డ అనేందుకు నీకు దమ్ములుంటయ్యా? ఉన్నా- నేను ఒప్పుకుంటానా? అది చెల్లుతుందా?"

అతను జవాబుకు మాత్రమే నిరీక్షిస్తున్నట్టు ఆమెవైపు చూస్తున్నాడు. ఆమె బాగా దెబ్బలుతిన్న వ్యక్తిలాగు నీరసంగా నేలచూపులు చూస్తోంది.

మరి నాలుగు నిమిషాలు నిశ్శబ్దత ఆ గదిలో తాండవించింది. ఈ సంభాషణ నాకు అంతుపట్టటం లేదు. అనుకున్నట్టు జరక్కపోవటం- నాలో కొత్తగా నిరుత్సాహాన్ని కూడ బెడుతోంది.

ఆమె ముఖంలోని కలత భావాలన్నీ మెల్లిగా మాయమయినై. కృత్రిమంగా నవ్వుతూ మెల్లిగా అంది. "నన్ను త్వరగా పంపండి. మళ్ళీ ఇంట్లో అనుమాన పడతారు- సినిమా టైం కూడా కావొచ్చింది-"

"మరి నేను అడిగిందానికి-"

"పోనిద్దురూ."

అతను లేచి అన్నాడు: "టైం ఐపోయిందిగా? ఇవ్వాల్టికి వెళ్ళు- మళ్ళీ ఎప్పుడన్నా వస్తావా?"

ఆమె ఆశ్చర్యపడి సమాధానం కోసం కాస్త ఆలోచించి తల తిప్పింది.

"సరే-పా- బైటవున్న జట్కాలో ఎక్కి వెళ్ళువుకాని-" అని ఆమెతో నిష్క్రమించాడు.

నాలో ఎన్నో భావాలు ఒక్కసారి పనిచేసినై. అతనేం రసికుడు? లోకంలో వృథాపొయ్యే ఆనందం ఎంతవుంది! అది కళ్ళకు కన్పిస్తూంటే ఎంత ఏడుపు?

అతను వచ్చి నా వీపు తట్టేదాకా నేనీ లోకపు మనిషినవలేదు.

"ఏమండి- ఏమైనా అర్థమైందా?" అన్నాడు.

అర్థమైతే యీ స్థితిలో ఎందుకుంటాను? మొట్టమొదటిసారి ఇంగ్లీషు టాకీని చూసిన పల్లెటూరి వాడికన్న - నాకిది ఎక్కువేమీ అర్థమవలేదు.

"ఉహుం" అన్నాను.

"చెప్తాను రండి-" అని పోర్టికోలోకి లాక్కువెళ్ళాడు. స్థిమితంగా కూర్చున్నాక, అతను సాగించాడు.

"ఆమె స్కూల్ ఫైనల్ చదువుతోంది. పరీక్ష ఫీజు కట్టేందుకు రేపు చివరిరోజు- పాపం- ఆస్తిపాస్తులు లేని వాళ్ళు- ఆమె తండ్రి చదువుకున్న వాడే- కాని ఉద్యోగం లేదు- తల్లి లేకపోవటంవల్ల యీమెను గారాబంగా పెంచుకుంటూ వచ్చాడు. అప్పు పుట్టినంతవరకూ తిన్నారు- ఇంకెక్కణ్నుంచి తెచ్చి కుటుంబ రక్షణ చెయ్యాలో అతనికి తెలియదు. రోగిష్టి ముసలి తల్లికి మందులు కొనగలిగే శక్తి కూడా అతనికి లేదు- ఏం చేస్తాడు- పాపం? స్నేహితులు అతన్ని వదిలారు. లోకమే అతన్ని లెక్కచెయ్యదు. విధి అంతకన్న ముందే ఎదురు తిరిగి కూర్చున్నాడు- ఇంకేం చేస్తాడు?"

నాకు ఆశ్చర్యంగానే వుంది- నేను ఊహించిన కథే వేరాయె. అతను మళ్ళీ అందుకున్నాడు. "ఐదారు నెల్లనుంచీ యీ పిల్ల నన్ను ఆకర్షించింది. ఆమె చుట్టూ తిరుగుతున్నాను- అదొక రకమైన ఆనందం కన్పించేది. నేనంటే ఇష్టంలేదని తెలిసినాకూడా నాపట్టు విడువలేదు- తీరా ఇవ్వాళ డబ్బు కావాలని మొట్టమొదటిసారి నాతో మాట్లాడింది. పాపం- అడిగిందికూడా- ఇరవై రూపాయిలే! ఇచ్చి, సినిమాకు రమ్మన్నాను. ఒప్పుకుంది- ఇక్కడికి రమ్మన్నాను- తలవూపింది..."

"ఆం" అన్నాను, అప్పుడే నిద్రనుంచి మేల్కొంటూన్నట్టు.

"ఔను- అంతకన్న ఏం చేస్తుంది? తండ్రిని అడగలేదు. ఇంట్లో ఏ విధమైన సహాయమూ లేదాయె. తనంతట తను సంపాదించుకోవాల్సిన పరిస్థితివచ్చె. జీవితాన్నీ, మనిషినీ నడిపేది 'అవసరం' ఐనప్పుడు - ఇంకో దారి ఏదీ? ఇన్నాళ్ళూ కష్టపడి

చదివిన చదువంతా వృథాపోతుందని పరితాపం- మళ్ళీ ఎవరికీ, ఇంట్లో కూడా తెలియకూడదు-"

వింతభావాలు నన్ను ముంచివేస్తున్నయ్.

"దీనికి మీరేమంటారూ?" అన్నాడు.

ఏమనగలను- ఏమీ అర్థమవటం లేదు.

"తెలియదు-" అన్నాను కొత్తభాషను వింటూన్న వాడిలాగు.

"తెలియదూ?" అని నవ్వి అన్నాడు. "ఇందాక మీరేమన్నారు- ప్రేమకథల్ని ప్రబోధకంగా రాయమన్నారు. నిజమైన జీవితాన్ని ఆ పూరిపాకలో చూడండి. దేశంలో డబ్బు లేకా, ఉన్నా అందరికీ తిండిలేకా- ప్రజలిలా తప్పుడు తోవల్లో నడుస్తూంటే ప్రేమ కథలు దేనికి- ఏడవను? ఆ అమ్మాయికి యీ ఈడునుంచే సంపాదన నెత్తిమీద పడితే - ఏం చేస్తుంది? ఆమెకు ఈనాటికీ అర్థమవలేదు- తను సంపాయించగల మార్గం ఒక్కటేనని! మళ్ళీ చదువుకుంది- డిక్షనరీలో మాటలు కొన్నింటిని ముక్కున కరుచుకొని - ఆ పరీక్ష పేపర్లు రాస్తే పాస్! ఈ పాడు జీవితంలో ఆమె చదవకపోతే ఎవడేడ్చాడు? ఎవరికి- చివరకు ఆమెకు మాత్రం - ఆ చదువేం ఉపయోగం? చదువుకున్న పిల్లకు యీ సంఘంలో ఏర్పడ్డ కొత్త విలువను చూసి, ఆ తండ్రి చదవేశాడు. కాని తీరా దిగాక- ఏం పెట్టి చదువుచెప్పించగలడూ? ప్రేమతో ఇప్పటినుంచే వేడెక్కి ఛస్తోంది- ప్రియుడు పాపం- అతను మాత్రం ఆమె కేం సహాయం చేస్తాడు? చెయ్యగలవాళ్ళ మనస్తత్వమన్నా ఆమెకు తెలియదు- ఆమె అమాయకత్వం చూడండి! పరువుకోసం మళ్ళీ ఎవరికంటా పడకూడదు. ఏమన్నా ప్రమాదాలుంటే తప్పుకోవటం ఎలాగో తెలియదు. పరిస్థితులు ప్రసాదించే కష్టాలతోపాటు, తనకుతానై తెచ్చుకునే కష్టాలెక్కువని ఆమె గ్రహించదు. రేపు పెళ్ళయి- చదువునూ, యీ బాధల్నీ మరిచిపోతే- సంఘాభివృద్ధికోసం పిల్లల్ని కంటూ కూర్చుంటే- సరిపోతుంది- ఎందుకొచ్చిన విజ్ఞానం? బీదవాళ్ళకు ఉచితంగా దొరకని విజ్ఞానాన్ని దేశమంతటా వెదజల్లి- ఏరుకోమంటే- ఏం లాభం?"

నేను గుడ్లప్పగించి వింటూ కూర్చున్నాను.

"ఏమిటల్లా చూస్తారు!" అర్థమవలా?- ఇష్టం లేకుండా తనకు ఇష్టం ఉన్నట్టు నటించి వెళ్ళాలని వచ్చింది. ఏం చేసుకోను అందమైన- ఆ రబ్బరు బొమ్మను? ఎందుకింత నటన? ఆ ఇరవై రూపాయిలే అడిగింది- ఇవ్వాల్టి అవసరం తీరాక - రేపటి గతేమిటో అక్కర్లేదు. మళ్ళీ ఇలాటి అవసరమే నెత్తిమీద కూర్చుంటే మళ్ళీ ఏం చెయ్యాలో కూడా తెలియదు. పోనీ రసీదూ, సాక్ష్యాలూ లేకుండా ఇచ్చిన ఇరవై రూపాయలకూ - నన్ను మోసగించరాదా? అదీ చాతకాదు. దానికి ఆ అంతరాత్మ

ఒప్పుకోదు! ఇలా నటించి నన్ను తృప్తి పరుస్తేనే కాని- కష్టపడి సంపాయించాననే తృప్తి ఆమెకు ఉండదు. ఏం- జీవితం?"

నిజంగా ఏమిటీ వింత జీవితం? ఆలోచనలో మునిగిపోయి మాట్లాడలేక పోతున్నాను.

నాకంతా అగమ్యగోచరంగానే వుంది.

ఒక నిమిషం ఆగి "ఇది కథగా రాస్తే?" అన్నాడు.

మళ్ళీ యీ ప్రపంచంలో పడ్డాను.

"రాయండి"- అన్నాను, నన్నింతగా చలింపచేసిందే అనుకుంటూ.

"రాస్తే- ఏం లాభం? దీనికోసం నేను ఇరవైరూపాయలు ఖర్చుపెట్టాను ఇ-ర-వై! ప్రచురించి మీరు నాకేమిస్తారు?"

నేనేమివ్వగలను- అతని పర్స్‌లో ఎప్పుడూ నాలాటి పదిపత్రికల్ని కొనగలిగే డబ్బుంటూండగా?

"ఏమీ ఇవ్వరు- పాఠకులు చదివి అవతల పారేస్తారు. మీరు మాత్రం వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తారు. అమ్మకంకాని కాపీల్ని పొట్లాలకుగాను, తూకానికి అమ్ముతారు-"

ఏం సమాధానం చెప్పను? జీవితంలోని అగాధాల్ని నాకు చూపుతున్నాడు. ప్రియురాలితో మాట్లాడకుండానే కథల్ని గీకిపారేసే మహానుభావులు జ్ఞాపకాని కొస్తున్నారు! ఈ విజ్ఞానం, ఒక్కసారిగా నన్ను ఆక్రమించటం భరించరానిదైంది. ఇక ఆ స్థలంలో ఒక్క నిమిషమైనా ఉండలేక పొయ్యాను.

మెల్లిగా సంచీ తీసుకొని "వెళ్ళివస్తానండీ" అన్నాను.

"రేపు వెళ్ళవచ్చు లెండి" - అంటున్నాడు.

-నేను వినిపించుకోకుండానే రోడ్డెక్కాను.

- ఆగష్టు, *1942*